ప్రజాశక్తి
ఆదివారం 22 జూన్ 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

వినియోగదారుల నడ్డి విరిచే

స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలి

- అవి ఏర్పాటుచేస్తే..
  ప్రజలపై అధిక భారం..
- 'స్మార్ట్' పేరుతో మరో
  జియో వంటి మోసం..
- సిపిఎం నగర కమిటీ



మాట్లాడుతున్న చీకటి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

వినియోగదారుల నడ్డివిరిచే విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు ప్రక్రియను అడ్డుకోవాలని సిపిఎం నగర నాయకులు ప్రకటించారు. శనివారం నాడు స్థానిక సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, నగర కార్యదర్శివర్గ సభ్యుడు జి.రమేష్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజలు ఎటువంటి దరఖాస్తు చేయకుండానే.. ప్రజామోదం లేకుండానే ప్రభుత్వం అదానీతో కుదుర్చుకున్న లోపాయికారీ ఒప్పందం ప్రకారం పాత మీటర్లు తొలగించి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు విమర్శించారు. నగరంలో నాలుగు యూనిట్లుగా విభజించి సుమారు లక్ష విద్యుత్ కనెక్షన్లకు ఈ మీటర్లు ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఇప్పుడున్న పాత మీటర్ల వల్ల వినియోగదారులకు ఎటువంటి సమస్యలూ తలెత్తలేదని, ఏ ఒక్కరూ మీటర్లు మార్చమని కోరలేదని, అయినా విద్యుత్ చౌర్యం అరికట్టే పేరున ఈ ప్రక్రియ చేపట్టినట్లు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపించారు. బిఎస్ఎన్ఎల్‌ను నిర్వీర్యం చేసేందుకు జియోను రంగంలోకి దించి బిఎస్ఎన్ఎల్‌ను నిర్వీర్యం చేసిన మాదిరిగా స్మార్ట్ మీటర్లు పేరుతో ప్రజలను మోసం చేసే ప్రభుత్వ చర్యలను సిపిఎం ఖండిస్తోందన్నారు. తాము ఎటువంటి విద్యుత్ భారాలు వేయమని టిడిపి ఎన్నికల్లో ప్రజలను నమ్మించి, అధికారం చేపట్టిన అనంతరం రూ.15 వేల కోట్ల మేర సర్ ఛార్జీలు, ట్రూ అప్ ఛార్జీలు మోపారని దుయ్యబట్టారు. 60 పైసలుగా వున్న విద్యుత్ సుంకాన్ని రూపాయికి పెంచినట్లు ఆరోపించారు. ఇప్పటి వరకు బిల్లు వచ్చిన తర్వాత 15 రోజుల లోపు చెల్లించుకునే సదుపాయంతో ▶ 2లో

ఫిషింగ్ హార్బర్‌కు మంగళం..!



ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్‌లో నిలిపి ఉంచిన బోట్లు

రిసార్టులు, రియల్‌ఎస్టేట్ దెబ్బకు అటకెక్కిన ప్రతిపాదనలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

చీరాల వాడరేవు వద్ద నిర్మించాల్సి ఉన్న ఫిషింగ్ హార్బర్‌ను ఈపురుపాలెం స్టయిట్‌కట్ ప్రాంతంలో ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు రిసార్టులు, రియల్‌ఎస్టేట్ దెబ్బకు అటకెక్కాయి. ప్రతిపాదిత ఫిషింగ్ హార్బర్ నిర్మాణ ప్రదేశానికి రెండు వైపులా అధికార పార్టీ అండదండలు ఉన్న వారు రియల్ స్టేట్, రిసార్టు పనులు చేపట్టిన నేపథ్యంలో వేలాది మంది మత్స్యకారులకు ఎంతగానో మేలుచేసే ఫిషింగ్ హార్బర్‌కు మంగళం పాడినట్లేనని భావిస్తున్నారు.

చీరాల–బాపట్ల సరిహద్దులోని సముద్ర తీర ప్రాంతమైన వాడరేవు, విజయలక్ష్మీపురం గ్రామాల మధ్య ఉన్న ఈపురుపాలెం స్ట్రయిట్ కట్ కాలువ కేంద్రంగా గత కొద్ది రోజులుగా రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, మత్స్యకారుల మధ్య నెలకొన్న వివాదం కారణంగా మరో సారి ఫిషింగ్ హార్బర్ అంశం ముందుకొచ్చింది. జిల్లాలోని చీరాల వాడరేవులో రూ.450 కోట్లతో ఫ్లోటింగ్ హార్బర్ రెండేళ్ల క్రితం మంజూరైంది. నీటిపై తేలియాడే విధానంలో నిర్మించే ఫ్లోటింగ్ జెట్టీ తరహా ఫిషింగ్‌హార్బర్ నిర్మాణం జరగాల్సి ఇక్కడ జరగాల్సి ఉంది. 2023 మే 15న అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన కూడా చేశారు. ఇందుకోసం వాడరేవు సముద్రపు ఒడ్డున ఉన్న 19 ఎకరాల భూమిని హార్బర్ కోసం కేటాయించారు. గతంలోనే టెండర్లు కూడా ఖరారయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో హార్బర్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్లు చెప్పారే తప్ప పనులు చేపట్టలేదు. నాబార్డు నిధుల మంజూరుతో పాటు రాష్ట్రం వాటా నిధుల విడుదలలో జరిగిన జాప్యం కారణంగా ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు అప్పట్లో ప్రారంభం కాలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిధులు సర్దుబాటు అయ్యే పరిస్థితి లేకపోవడంతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణ వ్యయాన్ని మూడో వంతుకు కుదించాలని నిర్ణయించారు. ప్రత్యామ్నాయంగా లోకాస్ట్ ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం నూతన ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ మేరకు నిపుణుల బృందం చీరాల వాడరేవు తీరప్రాంతంలో పరిశీలన జరిపారు. వాడరేవు సమీపంలో ఉన్న ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువను పడవల రాకపోకలకు అనుకూలంగా విస్తరించి జెట్టీల నిర్మాణాలు జరపడం ద్వారా ఫిషింగ్ హార్బర్ నిర్మాణం ఖర్చు తగ్గించవచ్చని ప్రతిపాదించారు. ఇలా చేయడం వల్ల నిర్మాణవ్యయం రూ.200 కోట్లకు తగ్గించవచ్చునని అంచనా వేశారు. సముద్ర ముఖద్వారం నుంచి ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువను ఒకటిన్నర కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయడం ద్వారా ఫిషింగ్ హార్బర్ నిర్మాణం తక్కువ వ్యయంలో పూర్తవుతుందని భావించారు. ప్రస్తుతం వివాదాల్లో చేరిన ఈపురుపాలెం స్టయిట్‌కట్‌ను ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం వినియోగించుకునే క్రమంలో దాన్ని లోతుగా రెండు వైపులా విస్తరించాల్సి ▶ 2లో

'మోడీ'కి చెప్పుకో.!

- 'కూటమి'లో భగ్గుమన్న విభేదాలు
- యోగా డే సందర్భంగా నేతల మధ్య వాగ్వాదం

2లో ▲

జిజిహెచ్ అభివృద్ధికి కృషి

సూపరింటెండెంట్ మాణిక్యరావు

3లో ▲

దిగజారుతున్న పొగాకు ధరలు

2374 బేళ్లు తిరస్కరణ

8లో ▲



యోగా చేస్తున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా, ప్రజాప్రతినిధులు

పొగాకు కొనుగోలు విషయంలో

నిర్లిప్తంగా ఉంటే ఉపేక్షించం

- రైతులకు విస్తృతంగా చెప్పాలి..
- 2 రోజుల్లో 201 క్వింటాళ్ల
  పొగాకు కొనుగోలు
- కలెక్టర్ వెంకటమురళి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బ్లాక్‌బర్లీ పొగాకు కొనుగోలు, రైతుల పేర్ల నమోదులో అధికారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ వెంకటమురళి హెచ్చరించారు. బ్లాక్ బర్లీ పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులకు తెలిసేలా విస్తత ప్రచారం చేయాలని చెప్పారు. బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలుపై మార్క్ ఫెడ్, వ్యవసాయశాఖ అధికారులు, ఎంపీడీవోలు మండల స్థాయి అధికారులతో శనివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ వీక్షణ సమావేశం నిర్వహించారు. రైతుల నుంచి ప్రతి ఆకు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందనే విషయాన్ని రైతులకు తెలియపరచాలన్నారు. సీఎం యాప్‌లో రైతుల పేర్ల నమోదు వేగంగా చేపట్టాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 1,961 మంది రైతుల వివరాలను సీఎం యాప్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. ప్రభుత్వం ముద్రించిన కరపత్రాలను రైతుల ఇళ్లకు వెళ్లి అందించాలన్నారు. హెచ్‌డిఆర్, హెచ్‌డిఎం నాణ్యమైనది, మధ్యస్థమైన రకాల బ్లాక్ బర్లీ పొగాకును ఒకే రకం కిందకు చేర్చి కేజీ ధర రూ.120 ఇస్తున్నామన్నారు. నాణ్యత తక్కువగా ఉన్న హెచ్‌డిఎక్స్ రకం బ్లాక్ బర్లీ పొగాకును రూ.60తో కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు. ఒక్కొక్క కొనుగోలు కేంద్రంలో ప్రతి రోజూ 50 టన్నులు పొగాకు పంట కొనుగోలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గడిచిన రెండు రోజుల్లో రూ.20 లక్షలు విలువైన 201 క్వింటాళ్ల పొగాకును కొనుగోలు చేశామన్నారు. ప్రస్తుతం ఏడు కొనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయన్నారు. కొనుగోలు ప్రక్రియ మూడు నెలల పాటు కొనసాగుతుందని వివరించారు.

కంట్రోల్ రూమ్ పనితీరుపై ▶ 2లో

ఆరోగ్యం కోసమే 'యోగా'

- ఒంగోలు ఎంపీ మాగుంట
- ఘనంగా అంతర్జాతీయ
  యోగా దినోత్సవం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

యోగా విద్యను సామాన్యుల దరికి చేర్చడం ద్వారా ప్రజలందరినీ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో సిఎం నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా తీసుకుని యోగాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారని ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆత్మ, మనస్సు, శరీరాన్ని ఏకం చేసే సాధనం యోగా అని, ప్రతి ఒక్కరూ వారి జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని పేర్కొన్నారు. శనివారం ఉదయం ఒంగోలు మినీ స్టేడియంలో జరిగిన 11వ అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకల్లో ఒంగోలు ఎంపీ మాగుంట కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్‌రావు, నగర మేయర్ గంగాడ సుజాతతో కలసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యోగాచార్యులు ఏడుకొండలు ఆధ్వర్యంలో యోగ ఔత్సాహికులతో కలసి యోగాసనాలు వేశారు. కలెక్టర్ తమీమ్‌అన్సారియా మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి యోగ పోటీలలో ప్రకాశం జిల్లా మొదటి బహుమతి సాధించినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో ప్రకాశం జిల్లా చెందిన ఏడు మంది గెలుపొందడం సంతోషదాయకమన్నారు. యోగా సాంగ్‌కు రాష్ట్ర స్థాయిలో ప్రకాశం జిల్లాకు మొదటి బహుమతి వచ్చిందన్నారు. ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ యోగాను ఆపకుండా ప్రతి రోజూ సాధన చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా మినీ స్టేడియం ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఒంగోలు ఆర్డీవో కె. లక్ష్మీ ప్రసన్న, జిల్లా పరిషత్ సిఈఓ బి.చిరంజీవి, బిసి కార్పోరేషన్ ఈడి ఎం.వెంకటేశ్వరరావు, స్టెప్ సిఈఓ పి. శ్రీమన్నారాయణ, డిఆర్‌డిఏ, మెప్మా పీడీలు నారాయణ, శ్రీహరి, డిఈఓ ఏ.కిరణ్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మోడీకి చెప్పుకో.!

- కూటమిలో భగ్గుమన్న విబేధాలు.!

- యోగా డే సందర్భంగా నేతల మధ్య వాగ్వాదం

ప్రజాశక్తి-పెద్దారవీడు

యోగాంధ్ర కార్యక్రమం సందర్భంగా కూటమి నేతల మధ్య విబేధాలు భగ్గుమన్నాయి. టిడిపి-బిజెపి వర్గీయుల మధ్య ఘర్షణ వాతావారణం నెలకొంది. ఈ సంఘటన మండల కేంద్రమైన పెద్దారవీడులో యోగా డే సందర్భంగా శనివారం చోటు చేసుకుంది. యోగాడే సందర్భంగా పెద్దారవీడులో కార్యక్రమాన్ని ఎంపిడిఓ ఎస్.జాన్ సుందరం బాధ్యత తీసుకున్నారు. ఈ వేడుకలో కూటమి సర్కార్‌లో భాగమైన టిడిపి, బిజెపి, జనసేన పార్టీల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోడీ ఫోటో ఎందుకు పెట్టలేదని బిజెపి నాయకుడు జివి రెడ్డి ప్రశ్నించారు. ఈ విషయంపై టిడిపి మండల మాజీ అధ్యక్షుడు గొట్టం శ్రీనివాసరెడ్డి కలుగజేసుకున్నాడు. జివి రెడ్డి-గొట్టం శ్రీనివాసరెడ్డిల మధ్య వాగ్వాదం జరిగింది. అధికారులు సర్ధి చెబుతున్నా గొడవ ఆగలేదు. 'మోడీ ఫొటో పెట్టం... అవసరమైతే మీ నాయకుడు మోడీకి చెప్పుకో.!' అని టిడిపి నేతలు పేర్కొనడంతో బిజెపి నేతలు జివి రెడ్డి, వాయిరి రామకృష్ణలు మరింత ఆగ్రహంతో ఊగిపోయారు. ఇరువురినీ అక్కడ ఉన్న అధికారులు నిలువరించారు. ఆ తరువాత యోగాంధ్ర కార్యక్రమం ఎంపిడిఒ జాన్ సుందరం అధ్యక్షతన జరిగింది.



బస్‌షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

బస్‌షెల్టర్ ప్రారంభం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండల పరిధిలోని మద్దిరాల గ్రామంలో యడవల్లి శేషయ్య జ్ఞాపకార్ధంగా నిర్మించిన బస్సు షెల్టర్‌ను ఎమ్మెల్యే బిఎన్. విజయకుమార్ శనివారం ప్రారంభించారు ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు ప్రయాణికుల సౌకర్యర్ధం శేషయ్య జ్ఞాపకార్ధంగా గ్రామస్తులు బస్సు షెల్టరును ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. బస్‌షెల్టర్ ప్రజలకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తేళ్ళ మనోజ్ కుమార్, తగిరిశ హనుమంతరావు, ఈమని నాగేశ్వరరావు, మారెళ్ల వెంకటశేషయ్య, పెంట్యాల సురేష్, జెట్టి.వెంకటస్వామి, పోకూరి నాగరాజు, మండవ వాసు, మండవ వెంకటేశ్వర్లు, జెట్టి వెంకటేశ్వరరావు, నందిగం కోటయ్య పాల్గొన్నారు.



తహశీల్దారును సన్మానిస్తున్న బాల సుబ్రహ్మణ్యం

తహశీల్దారుకు సన్మానం

ప్రజాశక్తి-మద్దిపాడు

మద్దిపాడు తహశీల్దారు వేమూరి ఆదిలక్ష్మిని రెవెన్యూ కార్యాలయంలో జనసేన మండల అధ్యక్షుడు నున్నా బాల సుబ్రహ్మణ్యం శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం అందజేసి, శాలువాతో సన్మానించారు. తహశీల్దారును కలిసిన వారిలో జనసేన మండల ఉపాధ్యక్షులు ఆరెం వెంకటేశ్వర్లు, దమ్ము సురేష్, ప్రధాన కార్యదర్శులు తిరుమలశెట్టి చిరంజీవి, కనపర్తి శేషయ్య చౌదరి, అంగలకుర్తి నరసింహం, కార్యదర్శులు ఏడుగుండ్ల సత్యం, దండే రామారావు, పొన్నం అయ్యప్ప తదితరులు ఉన్నారు.

ఉచిత నేత్ర శిబిరాలు కొనసాగిస్తాం

ప్రజాశక్తి-కనిగిరి

కంటి చూపు లేనివారికి చూపు కలిగించడమే తమ ప్రధాన లక్ష్యమని, అందుకోసం నిరంతరంగా నేత్ర వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని శంకర కంటి ఆసుపత్రి ప్రతినిధి శ్రీ రవి తెలిపారు. కనిగిరి పట్టణంలోని అమరావతి గ్రౌండ్స్‌లో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అధ్వర్యంలో జననీ చారిటబుల్ ట్రస్ట్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ మరియు శంకర కంటి ఆసుపత్రి సంయుక్తంగా శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించాయి. అధిక సంఖ్యలో నేత్ర పరీక్షల



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



నేత్ర వైద్య శిబిరానికి అధిక సంఖ్యలో వచ్చిన వృద్ధులు

కోసం శిబిరానికి తరలివచ్చారు. వైద్య శిబిరంలో పాల్గొన్నవారికి శంకర ఆసుపత్రి వైద్య బృందం రక్తపోటు, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ వి.శ్రీనివాసులు కంటి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు, చుక్కల మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో మొత్తం 556 మంది కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. ఎంపికైనవారిని విడతల వారీగా శంకర ఆసుపత్రికి ప్రత్యేక వాహనాల్లో తరలించేందుకు ఎమ్మెల్యే డా.ఉగ్రనరసింహారెడ్డి స్వయంగా ఏర్పాట్లు చేశారని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

'ఫిషింగ్ హార్బర్'కు మంగళం.!

(మొదటిపేజీ తరువాయి)

ఉంది. ఇలా చేస్తేనే పెద్ద బోట్లు లోపలికి వచ్చి లంగరు వేయగలవు. ఇందుకోసం స్ట్రయిట్‌కట్‌కు రెండు వైపులా స్థలసేకరణ చేపట్టాల్సి ఉంది. అయితే ఇక్కడ రెండు వైపులా ఉన్న స్థలాలు రియల్ ఎస్టేట్ల వారి చేతుల్లో ఉన్నాయి. ఇక్కడ సముద్ర ముఖద్వారం (సీమౌత్) విషయంలోనే నానా రగడ జరుగుతుంది. తమ బోట్లు నిలిపి ఉంచే అవకాశం లేకుండా పోయిందని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో వాడరేవు లేదా ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ వద్ద నిర్మించాల్సి ఉన్న ఫిషింగ్ హార్బర్ సంగతేమిటి? అనేది అంతుపట్టనిదిగా అయ్యింది.

ఇక్కడ ముందుగా అనుకున్న ప్రకారం ఫిషింగ్ హార్బర్ నిర్మాణం జరిగితే దీనికి అనుబంధంగా ఒడ్డున చేపల వేలం కోసం ప్లాట్‌ఫారాలు, ఐస్ ప్లాంట్, కోల్డ్‌స్టోరేజి యూనిట్, సోలార్ వ్యవస్థ, ఆయిల్ బంకు, పడవల మరమ్మతుల కోసం పెద్ద షెడ్లు అందుబాటులోకి వస్తాయి. కానీ స్థానికంగా నెలకొన్న రియల్ఎస్టేట్ వారి తాకిడికి మంజూరయిన ఫిషింగ్ హార్బర్ మరో చోటికి తరలివెళ్లే పరిస్థితులు ఏర్పడినట్లు భావిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు చీరాల ప్రాంతానికి మంజూరయిన ఫిషింగ్ హార్బర్ తరలివెళ్లకుండా చూడాల్సి ఉంది.

నిర్లిప్తంగా ఉంటే ఉపేక్షించం

(మొదటిపేజీ తరువాయి)

రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలలో టామ్ టామ్ నిర్వహించాలన్నారు. రైతుల పేర్లు నమోదు కాగానే వారి ఫోన్‌లకు ఎస్‌ఎంఎస్ ద్వారా వివరాలు వస్తాయని, వాటిని ఖచ్చితంగా అనుసరించాలనే విషయాన్ని వారికి తెలియపరచాలన్నారు. పంటను కొనుగోలు కేంద్రానికి ఎప్పుడు తీసుకురావాలి, ఎంత మోతాదులో తెచ్చుకోవాలి అనే విషయాలు ముందస్తుగా ఫోన్‌కి సమాచారం వస్తుందన్నారు. గ్రామాలలో క్షేత్రస్థాయి వ్యవసాయ శాఖ సిబ్బంది రైతుల ఇళ్లకు వెళ్లి మాట్లాడాలన్నారు. అవసరమైతే రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి వారి పొగాకులో తేమను గుర్తించడానికి తేమ యంత్రాలను కొనుగోలు చేస్తామని చెప్పారు. కొనుగోలుపై ఎలాంటి దుష్ప్రచారం రాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకష్ణ, మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ కరుణశ్రీ, ఉప కలెక్టర్ లవన్న తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లను అడ్డుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

పాటు అదనంగా మరో 15 రోజులలో చెల్లింపునకు వెసులుబాటు ఉండగా.. స్మార్ట్ మీటర్ల ప్రక్రియలో ముందే రీ ఛార్జి చేసుకోవాల్సి ఉందని, కనీసం రూ.500 రీ ఛార్జి చేసుకోవలసి ఉంటుందని తెలిపారు. కాగా రోజులో నాలుగు భాగాలుగా విభజించి రాత్రి వేళలు, వేసవి కాలం, పగటి వేళ ఒక్కో రేటు అమలు చేయనున్నారని, ఈ ప్రక్రియ ద్వారా అదనంగా వినియోగదారుల నుంచి వసూలు చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొన్నారు. ఈ విధానాలను ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో చెత్తపన్నుపై ప్రజలు ఆందోళన చేపట్టడంతో చెత్త పన్ను రద్దు చేసిన అంశాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పార్టీ నాయకులు జి.రమేష్ మాట్లాడుతూ పాలకులు అధికారంలో ఉన్నప్పుడు ఒక తీరుగా, ప్రతిపక్షం లో ఉన్నపుడు ఒక తీరుగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. నగర ప్రజలంతా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు ను అడ్డుకోవాలన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై ప్రజలందరూ జిల్లా కలెక్టర్, విద్యుత్ శాఖ ఎస్ఈకి వినతి పత్రాలు అందించాలని, ప్రజలకు అండగా తాము నిలుస్తామని ప్రకటించారు.

విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డి3 పరిధిలోని కర్నూలు రోడ్డు, ఆర్‌టిసి బస్టాండ్ ఏరియా, దిబ్బల రోడ్డు, సత్యనారాయణపురం, చంద్రయ్యనగర్ తదితర ప్రాంతాలలో ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ మరమ్మత్తుల (ట్రీ కటింగ్) కారణంగా విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ డిఈఈ కెవి.పాండు రంగారావు తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆగిఉన్న లారీని ఢీకొన్న కారు..

- మహిళ మృతి
- ముగ్గురికి గాయాలు
- చెట్టిచర్ల బస్టాండ్ సమీపంలో ఘటన



ఘటనా స్థలంలోనే మృతి చెందదిన అరుణ



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

ప్రజాశక్తి-బేస్తవారిపేట

కారు అదుపుతప్పి ఆగి వున్న ట్రాన్స్‌పోర్ట్ వాహనాన్ని ఢీకొనడంతో ఓ మహిళ మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన చెట్టిచర్ల బస్టాండ్ సమీపంలో రాష్ట్ర రహదారిపై శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన శ్రీనివాసులు నంద్యాలలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పత్తి విత్తనాల ఏజెంట్‌గా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. ఇటీవల వ్యక్తిగత పనుల నిమిత్తం గుంటూరు జిల్లా పొన్నూరుకు వచ్చారు. పనులు ముగించుకొని కుటుంబ సమేతంగా కారులో నంద్యాలకు బయలు దేరారు. ఈ క్రమంలో కారు చెట్టిచెర్ల బస్టాండ్ వద్దకు రాగానే అదుపుతప్పి రోడ్డు పక్కనే ఆగి వున్న క్రాంతి ట్రాన్స్‌పోర్టు వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఐ.అరుణ (30) అక్కడికక్కడే మృతి చెందారు.. వారి కుమారుడు రిషికేష్, కుమార్తె ఆర్వికకు స్వల్ప గాయాలయ్యాయి. కారు డ్రైవింగ్ చేస్తున్న శ్రీనివాసులకు తీవ్రగాయాలు కావడంతో వైద్య చికిత్స నిమిత్తం కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అరుణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బేస్తవారిపేట ఎస్ఐ రవీంద్రారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శి తీరుపట్ల
గ్రామస్తుల ఆగ్రహం

ప్రజాశక్తి - పొన్నలూరు

పొన్నలూరుకు చెందిన ఓ వ్యక్తి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు డెత్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేశారు. పంచాయతీ కార్యదర్శిని శనివారం కలిసి డెత్ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరారు. నగదు ఇవ్వనిదే సర్టిఫికెట్ ఇచ్చేది లేదని కార్యదర్శి చెప్పినట్లు బాధితులు వాపోయారు. బాధల్లో ఉన్న కుటుంబం పట్ల పంచాయతీ కార్యదర్శి ఇలా వ్యవహరించడం మంచి పద్ధతి కాదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా పని నిమిత్తం కార్యదర్శి వద్దకు వెళ్లితే పని చేయకుండా రేపు, మాపు అని సాకులు చెబుతూ తప్పించుకుని తిరుగుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విధుల పట్ల నిరక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శిపై తగుచర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. పంచాయతీ కార్యదర్శి డెత్ సర్టిఫికెట్ ఇవ్వని విషయం గురించి స్థానిక ఎంపిడిఒ సుజాతను వివరణ కోరగా, కార్యదర్శితో మాట్లాడి సోమవారం సర్టిఫికెట్ మంజూరునకు కృషి చేస్తామని తెలిపారు.

జిజిహెచ్ అభివృద్ధికి కృషి చేస్తా

సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎస్.మాణిక్యరావు బాధ్యతల స్వీకరణ



మాణిక్యరావుకు అభినందనలు తెలుపుతున్న వైద్యులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్య శాలను అందరి సహకారంతో మరింత అభివృద్ధి చేస్తామని సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు పేర్కొన్నారు. జిజిహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ తిరుపతిరెడ్డి నుంచి డాక్టర్ మాణిక్యరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం వైద్య కళాశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న డాక్టర్ మాణిక్యరావు బదిలీపై ఒంగోలు జిజిహెచ్‌కు వచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ మాణిక్యరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు త్వరలోనే మరిన్ని సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. జిజిహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎస్. మాణిక్యరావును పరిపాలనాధికారి కె.అద్దెయ్య, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్, సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ మాధవీలత, డాక్టర్ వి.చెంచయ్య, వైద్యులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

ప్రమాదవశాత్తూ
నదిలో పడి న్యాయవాది మృతి

ప్రజాశక్తి -రేపల్లె



శ్రీనివాసరావు(ఫైల్)

ప్రమాదవశాత్తు కృష్ణా నదిలో జారిపడిన జారి పడిన ఘటనలో ఓ న్యాయవాది మృతి చెందాడు. ఈ ఘటన రేపల్లె మండలం పెనుమూడి కష్ణానది రేవు వద్ద చోటు చేసుకుంది. రేపల్లె పట్టణ సిఐ మల్లికార్జునరావు కథనం ప్రకారం.. రేపల్లె పట్టణం ఏడో వార్డుకు చెందిన కొండపల్లి శ్రీనివాసరావు (40) శు క్రవారం సాయంత్రం కృష్ణా నది వద్దకు వెళ్లారు. ఒడ్డు వద్ద కాళ్లు కడుగుచుండగా ప్రమాదవశాత్తు జారీ నీటిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో ఊపిరి ఆడక మృతి చెందాడు. మృతుడి భార్య అంజలీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐ మల్లికార్జునరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాసరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, , ఇద్దరు సంతానం ఉన్నారు. శ్రీనివాసరావు మృతి పట్ల రేపల్లె బార్ అసోసియేషన్ న్యాయవాదులు, గుమస్తాలు ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలిపారు.



పొగాకు బేళ్లను పరిశీలిస్తున్న అధికారులు, వ్యాపారులు

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి- టంగుటూరు

టంగుటూరు పొగాకు వేలం కేంద్రానికి జరుగుమల్లి, వావిలేటిపాడు, టంగుటూరు, సాధువారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 939 బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 750 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 189 బేళ్లను తిరస్కరించారు.కిలో పొగాకు అత్యధిక ధర రూ.280, అత్యల్ప ధర రూ.180, సరాసరి ధర రూ. 235.73 పలికింది. పొగాకు వేలంలో 14 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నట్లు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కొండపి : కొండపి పొగాకు వేలం కేంద్రంలో శనివారం 229 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని కామేపల్లి, పచ్చవ గ్రామాలకు చెందిన రైతులు 1131 బేళ్లను అమ్మకానికి తెచ్చారు.అందులో 902 బేళ్ళ అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 229 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ట రూ. 280, కనిష్ట ధర రూ.180, సరాసరి ధర రూ. 251.78 పైసలు పలికింది. పొగాకు వేలంలో 18 కంపెనీలకు చెందిన ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాలొ్గన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండల పరిధిలోని అమ్మనబ్రోలు బాలికల గురుకుల పాఠశాలలో తెలుగు,ఇంగ్లీష్ , సోషల్ సబ్జెక్టులను బోధించుటకు బిఇడి అర్హత కలిగిన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ కె. మాధవి తెలిపారు. అదేవిధంగా టాయిలెట్లను శుభ్ర పరిచేందుకు స్కావెంజర్లు కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 8712625043 సెల్ నెంబరును సంప్రదించాలని ప్రిన్సిపల్ మాధవి తెలిపారు.

నేడు 'ఎంటిఎస్' నియామకానికి కౌన్సిలింగ్

- జిల్లాలో విద్యా శాఖ చూపిన ఖాళీలు 288
- 1998, 2008 డిఎస్‌సి అభ్యర్థులకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో బదిలీల అనంతరం ఏర్పడిన ఖాళీలను ఎంటిఎస్ (మినిమం టైమ్‌స్కేల్) టీచర్లతో భర్తీ చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్ కుమార్ శనివారం తెలిపారు. ఒంగోలు డిఆర్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు కౌన్సిలింగ్ ప్రక్రియ చేపట్టినట్లు ఆయన ప్రకటించారు. అర్హులైన అభ్యర్థులు కౌన్సిలింగ్‌కు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

1998- 2008 డిఎస్‌సి అభ్యర్థులకు ప్రాధాన్యత...

రెగ్యులర్ ఉపాధ్యాయులు లేని ఖాళీల్లో అనగా ప్రభుత్వ నిబంధనల మేరకు కనీసం ఒక్క టీచర్ కూడా లేని పాఠశాలలు, విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండి సింగల్ టీచర్ ఉన్న పాఠశాలలు, ఇద్దరు టీచర్లు మంజూరై ఒకే టీచర్ పని చేసే పాఠశాలలు, అయిదుగురు ఉపాధ్యాయులు మంజూరై, విద్యార్థుల సంఖ్య అనుసరించి ఒక ఎస్‌జిటిపని చేసే మోడల్ ప్రైమరీ పాఠశాలలు. నలుగురు ఉపాధ్యాయులు మంజూరై, విద్యార్థుల సంఖ్య అనుసరించి ఒక ఎస్‌జిటి పని చేసే మోడల్ ప్రైమరీ పాఠశాలలు, ముగ్గురు ఉపాధ్యాయులు మంజూరై ఇద్దరు పనిచేసే చోట ఎంటిఎస్ టీచర్లతో ఖాళీలను భర్తీ చేస్తారు. ఈ ఖాళీల్లో 1998 డిఎస్‌సికి ఎంపికై పోస్టులు పొందని వారికీ, 2008 డిఎస్‌సిలో ఎంపికై పోస్టులు పొందని వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తారు. వారు పోనూ మిగిలిన ఖాళీల్లో అర్హులైన వారితో భర్తీ చేస్తారు. వీరు 2025 - 2026 విద్యా సంవత్సరానికి 11నెలలు పాటు నోవర్క్ - నోపే విధానంలో పనిచేయాల్సి ఉంది.

ఉమ్మడి ప్రకాశంలో 288 ఖాళీలు

ఉపాధ్యాయుల బదిలీల అనంతరం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 288 ఎస్‌జిటి పోస్టులు ఖాళీగా ఉన్నట్లు విద్యా శాఖ ప్రకటించింది. ప్రాధాన్యత క్రమంలో ఆదివారం 233 ఎస్‌జిటి పోస్టులకు ఎంటిఎస్ టీచర్లతో భర్తీ చేసేందుకు జిల్లా విద్యా శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. గతంలో విద్యా శాఖ ప్రకటించిన ఖాళీలను బట్టి చూస్తే పశ్చిమ ప్రకాశం ప్రాంతంలో ఖాళీలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 7 నియోజకవర్గాల్లో(25 మండలాల్లో) ఆ శాఖ ప్రకటించిన వివరాల ప్రకారం యర్రగొండపాలెం నియోజకవర్గంలో 91, కనిగిరి నియోజకవర్గంలో 66, దర్శి నియోజకవర్గంలో 46, మార్కాపురం నియోజకవర్గంలో 36, గిద్దలూరు నియోజక వర్గంలో 28, కొండపి నియోజకవర్గం లో 12, కందుకూరు నియోజకవర్గం లో9 ఖాళీలుగా ఉన్నట్లు ప్రకటించింది.

సమీపంలో ఉన్న వారికి అవకాశం కల్పించాలి

మినిమం టైమ్ స్కేల్ పద్ధతిలో నియామకం చేపట్టే ఈ పోస్టులకు ఆయా ప్రాంతాల్లోని సమీప అభ్యర్థులతో (అర్హులైన వారిలో) భర్తీ చేయాలని యుటిఎఫ్ నాయకులు కొమ్మోజు శ్రీనివాసరావు, షేక్ అబ్దుల్ హై, డి, వీరాంజనేయులు, ఎస్ .రవి, ఎపిటి ఎఫ్ నాయకులు పివిఎస్.సుబ్బారావు, లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. వీరికి తక్కువ వేతనం చెల్లిస్తున్నందున దూర ప్రాంతాల్లో పని చేయాల్సి వస్తే ఖర్చులు అధికం అవుతాయని, సమీపంలోని ఖాళీల్లో భర్తీ చేస్తే కొంత వెసులు బాటు ఉంటుందని వారు పేర్కొన్నారు. ఎంటిఎస్ టీచర్లతో ఖాళీలన్నీ భర్తీ చేయాలని వారు కోరారు.



నీటి పొదుపుపై అవగాహన కల్పిస్తున్న విజయమ్మ

ప్రాణాధారమైన నీటిని పొదుపుగా వాడాలి

ప్రజాశక్తి - బాపట్ల

ప్రాణదారమైన నీటిని పొదుపుగా ఉపయోగించి నీటి వృధా తగ్గించి ప్రకృతి వనరులను పరిరక్షించాలని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి ఎస్ విజయమ్మ అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ జిల్లా కార్యాలయం వద్ద శనివారం స్వర్ణాంధ్ర, స్వఛ్చాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. నీటి పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షపు నీటిని సేకరించి నిల్వ చేసుకుని అవసరం అయినప్పుడు వాడుకోవాలని సూచించారు. వ్యర్థ జలాలను శుద్ధి చేసితిరిగి ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సురక్షిత తాగునీరు, పరిశుభ్రమైన నీటి వనరులను అందించడం ద్వారా ప్రజలు ఆరోగ్యావంతంగా ఉంటారని అన్నారు. రాష్ట్రాన్ని స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్‌గా తీర్చి దిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ లోకేష్, వైద్యాధికారి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


భోజనం నాణ్యత పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

పేదల ఆకలి తీర్చేందుకే అన్నా క్యాంటీన్ల ఏర్పాటు

ప్రజాశక్తి - చీరాల

నిరుపేదల ఆకలి తీర్చేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసినట్లు శాసన సభ్యులు కొండయ్య అన్నారు. స్థానిక మునిసిపల్ కార్యాలయం సమీపంలోని అన్న క్యాంటీన్‌ను టిడిపి అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్, గౌరీ అమర్నాద్‌తో కలసి ఆయన శనివారం సందర్శించారు. క్యాంటిన్‌లోని భోజనం స్వయంగా వడ్డించి, క్యాంటీన్ నాణ్యత పరిశీలించారు. ప్రజల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అన్నా క్యాంటిన్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట కౌన్సిలర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


ఎంపిడిఒను సన్మానిస్తున్న సిబ్బంది

ఎంపిడిఒ ఇన్‌ఛార్జిగా జనార్ధన్

ప్రజాశక్తి - ముండ్లమూరు

ఇన్చార్జ్ ఎంపిడిఒగా ఆర్ జనార్ధన్ స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్చార్జ్ ఎంపిడిఒగా దర్శి ఎంపిడిఒ కృష్ణమూర్తి పనిచేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపిడిఒ ఆర్ జనార్దన్‌ను కార్యాలయం సిబ్బంది సాలువాలు, పూలదండలతో సన్మానించారు.

సీనియర్ అసిస్టెంట్ మురళి బదిలీ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మురళి దర్శికి బదిలీ అయ్యారు. దర్శిలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పి సత్యనారాయణ ముండ్లమూరుకు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు.

పని గంటల పెంపు విరమించుకోవాలి

స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయ్యపరెడ్డి డిమాండ్

ప్రజాశక్తి - అద్దంకి

ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలు వ్యతిరేకిస్తూ శనివారం నిరసన చేపట్టారు. నిరసనకు డిఎవి సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా కార్యదర్శి పి తిరుపతిరెడ్డి, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అయ్యప్పరెడ్డి మాట్లాడారు. బ్రిటిష్ కాలంలోనే కార్మికులు అనేక కష్ట, నష్టాల కు ఓర్చి పోట్లాడి ఎనిమిది గంటల పని దినం సాధించుకు న్నట్లు తెలిపారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు అనుకూలంగా ఉన్న కార్మిక చట్టాలను మార్పులు చేసి యజమానులకు బాసటగా నిలిచి కార్మికుల ప్రయోజనాలకు తూట్లు పొడిచే విధంగా చట్టాలు మార్చుతున్నారని పేర్కొన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలో తీసుకొచ్చిన ఈ బిల్లును రాష్ట్రంలో ఎన్డీఎ కూటమి అమలు చేయాలని నిర్ణయించడం కార్మికులకు నష్టం చేయడమేనని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయ్యప్పరెడ్డి మాట్లాడుతూ రోజుకు 10 గంటలు కార్మికులు పనిచేయడం వల్ల దేశానికి నష్టం జరుగుతుందని అన్నారు. దీనివల్ల ఉత్పత్తి పెరిగి ఆ వస్తువులు కొని వినియోగించుకునే శక్తి దేశంలో వినియోగదారులకు ఉండదని అన్నారు. ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గిపోతుందని అన్నారు. 10 గంటల పని దినాన్ని అమలు చేసినట్లయితే నిరుద్యోగం పెరుగుతుందని అన్నారు. భవిష్యత్తులో నేటి యువతకు ఉద్యోగములు లేక తీవ్రంగా ఇబ్బంది పడే అవకాశం ఉందని అన్నారు. నిరుద్యోగ సమస్య తగ్గాలంటే రోజుకు ఆరు గంటలు, వారానికి ఐదు రోజులు మాత్రమే పని చేయడం ద్వారా నిరుద్యోగ సమస్యలు పరిష్కరించవచ్చని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు పగలు పనిచేయడంలోనే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మార్చిన చట్టాల ప్రకారం మహిళలు రాత్రి కూడా పనిచేసేందుకు వీలు కల్పించారని, ఇది అత్యంత దౌర్భాగ్యం అన్నారు. పది గంటల పనివిధానం తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అనూష, శంషావలి, పనీంద్ర, కామేశ్వరరావు, శ్రీనివాసరావు, శేఖర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అయ్యపరెడ్డి

యువతకు ఉపాధి కల్పించేందుకే జాబ్ మేళా

- మెగా జాబ్ మేళాకు హాజరైన యువత
- హాజరైన యువతకు భోజన వసతి
- శాసన సభ్యులు ఎంఎం కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

చదువు పూర్తి చేసుకుని ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకే అనేక కంపెనీల సమన్వయంతో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు శాసన సభ్యులు ఎంఎం కొండయ్య అన్నారు. స్థానిక ఎన్ఆర్ అండ్ పిఎం ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాలో ఆయనతోపాటు యువ నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్ మాట్లాడారు. యువత భవితవ్యాన్ని మెరుగుపర్చే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాకు అధిక సంఖ్యలో యువత హాజరయ్యారు. జాబ్ మేళాలో వేలాదిగా యువత తమ భవిష్యత్తుకు కొత్త మార్గాన్ని తెరవడానికి విశేషంగా స్పందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ ప్రతి యువకుడు ఉద్యోగం పొంది ఆర్థిక స్వావలంబన సాధించాలని అన్నారు. సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని కోరారు. తెలుగుదేశం అధికార ప్రతినిధి మహేంద్రనాథ్, యువ నాయకులు గౌరీ అమర్నాథ్ కలిసి యువతకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. జాబ్ మేళా ప్రాంతంలో వైద్యశిభిరం నిర్వహించారు. తాగునీరు, మజ్జిగ, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. 40కి పైగా కంపెనీలు హాజరు కాగా అనేక మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. జాబ్ మేళా ద్వారా మంచి అవకాశాలు లభించేందుకు యువతకు మార్గం ఏర్పడిందని అన్నారు. క్యాంటీన్ సిబ్బంది, జాబ్ మేళా ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులను అభినందించారు. మొట్టమొదటిసారిగా ఆల్ ఇండియా సైకిల్ కాంపిటీషన్ నిర్వహణకు పునాది వేస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రీడా ఉత్సవాన్ని ఈ నెల 22న వాడరేవు బీచ్ నుండి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల ద్వారా యువత క్రీడా రంగంలో తమ ప్రతిభ చాటుకునే అవకాశం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సూరగాని లక్ష్మి, మించాల సాంబశివరావు, గోలి జగదీష్, మామిడాల రాములు, ఉల్లిపాయల సుబ్బయ్య పాల్గొన్నారు.


జాబ్‌మేళా ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

గ్రామ సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలి


తహశీల్దారుకు అర్జీ సమర్పిస్తున్న గ్రామ సర్వేయర్లు

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని గ్రామ సర్వేయర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని గ్రామ సర్వేయర్ల కోరారు. స్థానిక తహశీల్దారు బ్రహ్మయ్యకు సర్వేయర్లు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సర్వేయర్లు మాట్లాడుతూ గ్రామ సర్వేయర్ల రాష్ట్ర అధ్యక్షుడు భూరాడ మధుబాబు ఆదేశాల మేరకు నిరసన తెలిపారు. సర్వేయర్లకు స్పష్టమైన ప్రమోషన్ ఛానల్ కావాలని తెలిపారు. రీసర్వే, జాయింట్ ఎల్‌పిఎంఎస్‌కు కావలసిన లాప్టాప్, ఇతర స్టేషనరీ కావాలని పేర్కొన్నారు. రేషనలైజేషన్ గురించి ప్రభుత్వం నుండి స్పష్టమైన సమాధానం లేదని తెలిపారు. సచివాలయ సిబ్బంది లానే ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటలవరకు ఉద్యోగం చేయగలమని పేర్కొన్నారు. సీనియారిటీ జాబితాను వెంటనే ప్రతి జిల్లాలో విడుదల చేసి పదోన్నతి కల్పించాలని కోరారు. విధుల్లో ఉన్న సమయంలో టీసీ, వీసీ నిర్వహించరాదును సూచించారు. సొంతం మండలంలో ట్రాన్స్‌ఫర్‌కు అవకాశం కల్పించాలని కోరారు. తమ సమస్యలు పరిస్కారం అయ్యే వరకు శాంతియుతంగా పెన్ డౌన్ చేస్తున్నట్లు తెలిపారు.

పంగులూరు : గ్రామ స్థాయి సర్వేయర్లుగా పనిచేసే తమకు పదోన్నతులు కల్పించి బదిలీలు చేయాలని మండలంలోని సర్వేయర్లు కోరారు. తహశీల్దారు పీ సింగారావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. స్వర్ణాంధ్రవిజన్ 2047లో భాగంగా సచివాలయ సిబ్బందిని హేతుబద్ధీకరణ చేస్తున్నారని, భూ సర్వేయర్లయిన తమను జనాభా ప్రాతిపదికన కాకుండా, రెవిన్యూ విలేజ్ ప్రాతిపదికగా హేతుబద్దీకరించాలని కోరారు. సర్వే డిపార్ట్మెంట్‌లో ఉన్న గ్రామ సర్వేయర్ల విధులకు ఆటంకం కలగకుండా సర్వే పనుల బాధ్యతలు, లీవ్ అప్రూవల్, డిడిఓ పవర్, ఇతర పరిపాలన సౌలభ్యం కలిగిన వ్యవహారాలు అన్నింటినీ సర్వే శాఖకు బదిలీ చేయాలని కోరారు. ఇంకా అనేక డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్వేయర్లు తిరువీధుల వీరాంజనేయులు, కసిరెడ్డి అనంతరెడ్డి, పోలిశెట్టి చందు, నక్క సుధాకర్, పర్శపాగు నరేష్, జెల్లీ బేస్లీ దీపిక, షేక్ నజ్మా, గెల్లా ప్రసన్న బాబు, నాయపాము ఎలీషా, షేక్ నాగుల్ మీరావలి, పాలపర్తి రవి, ఈపూరి రాజా, చలంచర్ల రవిబాబు, పాలపర్తి నాగార్జున పాల్గొన్నారు.


తహశీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న సర్వేయర్లు


ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభిస్తున్న గొట్టిపాటి పూర్ణ కుమారి

కూచిపూడిలో పెట్రోలు బంకు ప్రారంభం

ప్రజాశక్తి - అమృతలూరు

మండలంలోని కూచిపూడిలో మూల్పూరు మలుపు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్‌కు చెందిన రామ ఫిల్లింగ్ స్టేషన్ (న్యూ పెట్రోల్ బంక్) ను వేమూరు ఎఎంసి చైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి చేతుల మీదుగా శనివారం ప్రారంభించినారు. కూచిపూడి తదితర ప్రాంతాల ప్రజలకు ఈ పెట్రోల్ బంకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ మేరకు పెట్రోల్ స్టేషన్ యాజమాని గద్దల ఆల్విన్ బాబును అంబేద్కర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఆళ్ళమూడి ప్రభాకరరావు చేతులు మీదగా శాలువా కప్పి పుష్ప గుచ్చం అందజేసి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్ర పటంతో సన్మానించారు. దళితులు వ్యాపార రంగంలో ఎదిగి ఆర్థిక అభివృద్ధి చెందాలని కోరారు. నూతనంగా వ్యాపార రంగంలో అడుగుపెట్టిన ఆల్విన్ బాబుకు అభినందించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మారుతి శేషమాంబ, తహశీల్దారు కూచిపూడి నెహ్రూ బాబు, సర్పంచి తాళ్లూరి రజనీకాంత్, దమ్ము కిశోర్, ఐమాళ్ళ ప్రమోద్, తెనాలి రాజగోపాల్, వేమూరు రవి పాల్గొన్నారు.

'క్రీడా వికాసాని'కి పురిటి నొప్పులు

- పట్టించుకోని ప్రభుత్వాలు
- మరుగునపడ్డ ఆటల సామరగి
- రూ.రెండు కోట్లు మట్టిపాలు
- క్రీడాకారులకు ఇక్కట్లు



నిరుపయోగంగా ఉన్న క్రీడా వికాస కేంద్రం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 2014లో అప్పటి టిడిపి ప్రభుత్వం నియోజకవర్గానికి ఓ క్రీడా వికాస కేంద్రాని మంజూరు చేసింది. అందులో భాగంగా నియోజక వర్గ కేంద్రమైన యర్రగొండపాలెంలో క్రీడా వికాస కేంద్రాన్ని నిర్మించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో క్రీడా వికాస కేంద్రాల నిర్వహణ గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో అవి శిథిలావస్థలకు చేరాయి.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించి వారిలోని నైపుణ్యాన్ని వెలికి తీసి తీర్చిదిద్దాలని అప్పటి టిడిపి ప్రభుత్వం స్పోర్ట్స్ అథారిటీ నిధుల నుంచి రూ. రెండు కోట్లు మంజూరు చేసింది. దీంతో యర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడా వికాస కేంద్రం నిర్మాణానికి 2018 మే 14న అప్పటి ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు శంకుస్థాపన చేశారు. పనులను వేగవంతంగా పూర్తి చేశారు. అంతలోనే ప్రభుత్వం మారి వైసిపి అధికారంలోకి వచ్చింది. వైసిపి ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే, మంత్రిగా పని చేసిన ఆదిమూలపు సురేష్ క్రీడా వికాస కేంద్రానికి వైఎస్ఆర్ క్రీడా వికాస కేంద్రంగా నామకరణం చేసి ఆర్భాటంగా ప్రారంభించారు. దాని నిర్వహణకు వైసిపి ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. దీంతో అది శిథిలావస్థకు చేరింది.

కూటమి ప్రభుత్వ హయాంలో..

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూరైంది. ఈ ఏడాది కాలంలోనూ క్రీడా వికాస కేంద్రం గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో మట్టిలో మాణిక్యాలాంటి క్రీడాకారులు అనేక మంది ఉన్నారు. ఈపాటికే వివిధ క్రీడల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణిస్తున్నారు. వారు తర్ఫీదు పొందేందుకు క్రీడా వికాస కేంద్రంలో సరైన సౌకర్యాలు లేవు. కనీసం క్రీడా వికాస కేంద్రాన్ని ప్రతిరోజూ తెరిచే నాథుడే కరువయ్యారు. వాచ్‌మెన్‌ను తొలగించారు. గతం ప్రభుత్వంలో నియమించిన అభివృద్ధి కమిటీ తొలగించి కూటమి ప్రభుత్వంలో కొత్త కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ పేరుకే అన్న చందంగా మారింది.

మూలకు చేరిన పరికరాలు..

క్రీడా వికాసం కేంద్రంలోని క్రీడా పరికరాలు మూలకు చేరాయి. ఈ కేంద్రంలో రెండు షటిల్ కోర్టులు, జిమ్ చేసుకునే సామగ్రి మాత్రమే ఉన్నాయి. ఇతర క్రీడా సామగ్రి లేదు. దీంతో క్రీడాకారులు కేంద్రానికి వెళ్లడమే మానుకున్నారు. ఆర్భాటంతో ప్రారంభించిన క్రీడా వికాస కేంద్రం పనికి రాకుండ పోవడంతో తీవ్ర మదన

క్రీడా వికాస కేంద్రాన్ని అభివృద్ధి చేయాలి

షేక్ జానీ, యర్రగొండపాలెం



యర్రగొండపాలెం ప్రాంతంలో మట్టిలో మాణిక్యాల్లాంటి క్రీడాకారులు అనేక మంది ఉన్నారు. వారికోసం క్రీడా వికాస కేంద్రం నిర్మించారంటే ఎంతో సంబర పడ్డాం. అది మూన్నాళ్ల ముచ్చటగానే మారింది. ప్రస్తుతం తలుపులు తీసే దిక్కే లేరు. క్రీడా వికాస కేంద్రాన్ని అభివృద్ధి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తేవాలి.

సౌకర్యాలు లేవు

గర్నెపూడి సీమోన్, యర్రగొండపాలెం



ఈ ప్రాంతంలో క్రీడల్లో రాణించే సత్తా ఉన్నా యువతీ యువకులు ఉన్నారు. షటిల్ కోర్టులు, జిమ్ సామగ్రి మినహా ఏ ఇతర సామగ్రి లేదు. క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా చర్యలు చూపి క్రీడావికాస కేంద్రానికి పూర్వ వైభవం తీసుకురావాలి. అప్పుడు క్రీడాకారులు తమ సత్తాచాటి రాష్ట్ర, దేశ క్రీడల్లో రాణిస్తారు.

ఉప్పు రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి- కొత్తపట్నం

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొత్తపట్నం ఉప్పు రైతులు ఎంపీ మాగుంట శ్రీనివాసులు, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌ను శనివారం వారి కార్యాలయాల్లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తాము పండించిన పంటను ఉప్పు కొటార్ల నుంచి తెచ్చుకోవడానికి సరైన రహదారి మార్గం లేదని తెలిపారు. దీంతో పంటను అమ్ముకొనేందుకు ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఉప్పు కొటార్లకు మంచి నీటి కుళాయిలు బిగించాలని కోరారు. ఉప్పు కొట్టారు భూములకు



ఎంపీ మాగుంటకు వినతి పత్రం అందజేస్తున్న ఉప్పు రైతులు

ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం కల్పించాలని కోరారు. వరద నీరు భూముల్లో రాకుండా ఉప్పుకొటార్ల చుట్టూ మేటికట్ట ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో స్పందించిన ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ఎంపీ నిధులతో రహదారి నిర్మించేందుకు కృషి చేస్తామని తెలిపారు. రెవెన్యూ , మండల పరిషత్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామ నిఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప్పు ఉత్పత్తిదారుల సహకారం సంఘం అధ్యక్షుడు నాటారు ఆంజనేయులు, కార్యదర్శి పట్టపు సునీల్ ,సభ్యులు తంబి సురేష్ ,పిచ్చయ్య, ,భూషణం. రాగాల కోటేశ్వరరావు, కోడూరి శ్రీను, పుచ్చలపల్లి లక్ష్మణ, మహిళా రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోవాలి : తహశీల్దారు

ప్రజాశక్తి-కొండపి

భూముల రీ సర్వే నిర్వహించిన గ్రామాలలో భూమి జాయింట్ ల్యాండ్‌గా నమోదైనందున తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ లబ్ధిదారులకు భూసంబంధిత సమస్యలు తలెత్తినట్లు తహశీల్దారు ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. రీసర్వే పూర్తయిన రెవెన్యూ గ్రామాలలో జాయింట్ ల్యాండ్ పార్శిల్ మ్యాప్ (ఎల్‌పిఎం) కలిగిన లబ్ధిదారులకు భూములకు సంబంధించి విస్తీర్ణం అధికంగా నమోదైనట్లు తెలిపారు. దీంతో వారిని తల్లికి వందనం,అన్నదాత సుఖీభవ పథకానికి అనర్హులుగా చూపినట్లుగా గుర్తించామన్నారు. జాయింట్ ఎల్‌పిఎం కలిగిన రైతులు తమ పేరునున్న భూమిని తప్పనిసరిగా సింగిల్ ఎల్ పిఎంగా మార్చించుకోవాలన్నారు. అందువల్ల భూమి వివరాలు ఖచ్చితంగా నమోదవుతాయని తెలిపారు. తద్వారా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి వారికి చేకూరుతుందని తెలిపారు. ఈ సబ్ డివిజన్ ప్రక్రియను పూర్తి చేసుకోవడానికి ఈ నెల 30 వరకూ అవకాశం ఉందని తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తయిన అనంతరం పథకం అమలులో స్పష్టత ఏర్పడి, అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనం కలుగుతుందన్నారు.

శింగరాయకొండ: భూముల రీ సర్వే జరిగిన గ్రామాల్లో తల్లికివందనం, అన్నదాత సుఖీభవ పథకం అమలుకు



శింగరాయకొండలో మాట్లాడుతున్న అధికారులు

ఎల్‌పిఎం నంబర్లు సమస్యగా మారినట్లు డిప్యూటీ తహశీల్దారు ప్రసాద్, ఆర్ఐ తిరుమలరావు, సర్వేయర్ బ్రహ్మం తెలిపారు. ఈనెల 30 లోపు అర్జీ పెట్టుకుంటే సమస్య పరిష్కరిస్తామని వారు తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రీ సర్వే జరిగిన గ్రామాల్లో ఎవరైనా ఖాతా నెంబరు పరిశీలిస్తే అందరికీ 10 ఎకరాలు చూపుతుందన్నారు. అందులో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకం వారికి వర్తించదని తెలిపారు.ఈనె 30లోపు రూ.50 చలానా కట్టి అర్జీ పెట్టుకుంటే సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. మూలగుంటపాడులో 87 మంది, కలికివాయలో 332 కనుమళ్ల 226, శానంపూడిలో 197, పాకలలో 293 మందికి ఇలాంటి సమస్యలు ఉన్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మద్దిపాడు : రైతులు భూ సమస్యల పరిష్కరించుకొని ప్రభుత్వ పథకాలను పొందాలని తహశీల్దారు వేమూరి ఆదిలక్ష్మి తెలిపారు. రీ సర్వే జరిగిన గ్రామాలలో జాయింట్ ల్యాండ్‌గా నమోదైనందున పలువురు రైతులు తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు అనర్హులు అయినట్లు రీసర్వే పూర్తయిన గ్రామాలలోజాయింట్ ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (ఎల్‌పిఎం) కలిగిన లబ్ధిదారుల భూములకు సంబంధించి విస్తీర్ణంలో అధికంగా నమోదు కావడం వల్ల తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకానికి అనర్హులుగా చూపినట్లు గుర్తించామన్నారు. జాయింట్ ఎల్‌పిఎం కలిగిన రైతులు తమ పేరునున్న భూమిని తప్పనిసరిగా మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందువల్ల భూమి వివరాలు కచ్చితంగా నమోదు అవుతాయని తెలిపారు. తద్వారా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు అర్హులు అవుతారని తెలిపారు. ఈ సబ్ డివిజన్ ప్రక్రియను పూర్తి చేసుకోవడానికి ఈ నెల 30 వరకూ అవకాశం ఉన్నట్లు తెలిపారు. భూమి వివరాల్లో కచ్చితంగా ఉండకపోతే ప్రభుత్వ పథకాలకు జాప్యం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలు కోసం రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.



బహుమతి అందజేస్తున్న హెచ్‌ఎం సూసన్నకుమార్

విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలం కె.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి, ఇంటర్‌లో ప్రథమ, ద్వితీయ తతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు దాతలు గుండపనేని శ్రీనివాసులు, పాపారావు పాఠశాల యాజమాన్యం సహకారంతో ఒక్కొక్క విద్యార్థికి రూ. 5000 చొప్పున నగదు బహుమతులు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ సుశీలా దేవి,గ్రామ ప్రత్యేక అధికారి పేరయ్య, పంచాయతీ కార్యదర్శి పుష్పలత, పాఠశాల సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎఒ మాల్యాద్రి

ఇకెవైసి చేయించుకోవాలి : ఎఒ

ప్రజాశక్తి-కొండపి

అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకానికి సంబంధించి ఇకెవైసి పెండింగ్ ఉన్న రైతులు వెంటనే పూర్తి చేసుకోవాలని ఎఒ ఎం. మాల్యాద్రి తెలిపారు. మండలంలో 5,875 మంది రైతులు లబ్ధిదారులుగా ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం నూతనంగా ఇనాం, అసైన్డ్ భూములకు చెందిన 596 మందిని ఈ పథకానికి అర్హులుగా ప్రకటించినట్లు తెలిపారు. కొత్తగా అర్హులైన వారితో కలిపి మొత్తం 6471 మంది లబ్ధిదారులుగా గుర్తించామన్నారు. రైతులందరూ ఇకెవైసి పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. కేవలం 39 మంది రైతులకు ఇకెవైసి పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఆ రైతులు కూడా తమ పరిధిలోని రైతు సేవాకేంద్రాలలో ఇకెవైసిని చేయించు కోవాలన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ రజియా సుల్తానా

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - నాగులుప్పలపాడు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాల ఎస్ఐ షేక్ రజియా సుల్తానా తెలిపారు. మండల పరిధిలోని మాచవరం జిల్లాపరిషత్ హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్దులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సైబర్ నేరాల నియంత్రణపై శనివారం అవగాన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ మోసాలతో ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బాలికల పట్ల ఎవరైనా అసభ్యం ప్రవరిస్తే తమ తల్లిదండ్రులు, లేదా ఉపాధ్యా యులకు తెలియజేయాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తులతో ఫోన్‌లో ఎక్కువ సేపు మాట్లాడరాదని తలెఇపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివరామ్ ప్రసాదు , పీడీ సురేష్ బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ జల్లీ విల్సన్

ఎన్నికల హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి - సంతమాగులూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్నాయని సిపిఐ మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. మండలంలోని కొమ్మాలపాడు పాత పోలీసు స్టేషన్ మైదానంలో సిపిఐ మండల 7వ మహాసభ శనివారం నిర్వహించారు. సభలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండగా ఒకవిధంగా, అధికారం రాగానే మరొక విధంగా పనిచేస్తూ ప్రజల సమస్యలు విస్మరించి కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో చెప్పిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని కోరారు. పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, పక్కా గృహాలు నిర్మించాలని, కొమ్మలపాడు, అగ్రహారం భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామంలో నిరుపయోగంగా ఉన్న రక్షిత మంచినీటి పథకాన్ని పునరుద్ధరించేలా మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ముందుగా గ్రామంలో కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ప్రజా నాట్య మండలి కళాకారులు గేయాలతో కార్యకర్తలను ఉత్సాహపర్చారు. అనంతరం సిపిఐ నూతన కమిటీ కార్యదర్శిగా కాలేషా గారి ఖాదర్ బాషా, సహాయ కార్యదర్శిగా రమణయ్య, ధనలక్ష్మిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ పాల్గొన్నారు.



చాంద్ నాగ్‌కు స్వాగతం పలుకుతున్న వైసిపి నాయకులు

'యువత పోరు'ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - బాపట్ల

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా యువతకు నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ అమలు చేయకపోవడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ ఈనెల 23న వైసిపి యువత పోరు నిర్వహిస్తున్నట్లు వైసిపి యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెరుగు చాంద్ నాగ్ తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా అన్ని జిల్లా కేంద్రాల్లో యువత పోరు నిరసన నిర్వహించనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో యువతకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని అన్నారు. యువతకు నిరుద్యోగ భృతి అమలు చేయలేదని పేర్కొన్నారు. జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ఇచ్చిన హామీ గాలికి వదిలేశారని అన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. ప్రతిపక్షంపై ఉద్దేశపూర్వకంగా కేసులు పెడుతున్నారని అన్నారు. జాబ్ క్యాలెండర్ ఊసే లేదని అన్నారు. పెట్టుబడులు, పరిశ్రమలు వచ్చాయని ప్రజలను ప్రచార ఊహల్లో ముంచుతున్నారని అన్నారు. రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పించకపోగా ఉన్న ఉద్యోగాలు తొలగిస్తున్నారని అన్నారు. కలెక్టరేట్ కార్యాలయం వద్ద జరిగే యువత పోరుకు వైసిపి శ్రేణులు హాజరు కావాలని కోరారు. నిరసన అనంతరం కలెక్టరుకు వినతి పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు యర్రయ్య, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చెంచయ్య, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి డి.జయభారతరెడ్డి, ప్రధాన కార్యదర్శి నక్కా వీరారెడ్డి పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఒక పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించగా మండలంలోని పొగాకు రైతుల సౌకర్యార్థం మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న వేర్ హౌస్ గోదాములో ఏర్పాటు చేసిన మరో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ జె వెంకట మురళి రిబ్బన్ కత్తిరించి శనివారం ప్రారంభించారు. గోదాములోని కాటా వద్ద శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు కొబ్బరికాయ కొట్టి కొనుగోలు ప్రారంభించారు. రైతులు తీసుకువచ్చిన పొగాకు బేళ్ల తేమ శాతాన్ని లెక్కించే పరికరం వినియోగించి తేమ శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ రైతులు తమ పోగాకును కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేటప్పుడు మార్క్‌ఫెడ్ నిర్ణయించిన నిబంధనలకు అనుగుణంగా తీసుకురావాలని చెప్పారు. కొనుగోలు చేసిన పొగాకు నిల్వ చేసేందుకు ప్రభుత్వ గోదాములు సరిపోని పక్షంలో ప్రైవేట్ గౌడాములు కూడా వినియోగిస్తామని తెలిపారు. కలెక్టర్‌తో పొగాకు కొనుగోళ్లపై సమీక్షించారు. వంకాయలపాడు, ఇంకొల్లు, చీరాలలో పొగాకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు తమకు కేటాయించిన తేదీల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి పొగాకు బెళ్లను కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించాలని తెలిపారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట మార్క్‌ఫెడ్ మేనేజర్ కరుణశ్రీ, వ్యవసాయ అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



పర్చూరులో 2వ కేంద్రం ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకట మురళి, ఎమ్మెల్యే ఏలూరి



ఉపాధ్యాయుడు కె బాపూజీని సన్మానిస్తున్న గ్రామస్తులు

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి - చెరుకుపల్లి

పాఠశాల విద్యార్థుల అభివృద్ధికి, విద్యా బోధనలో ఉత్తమ కృషి చేసిన ఉత్తమ ఉపాధ్యాయుడు కాగితపు బాపూజీ అని మండలంలోని కామినేని వారిపాలెం గ్రామస్తులు కొనియాడారు. మండలంలోని ఆరుంబాక పంచాయతీ కామినేని వారిపాలెం ప్రాథమిక పాఠశాల్లో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న బాపూజీ బదిలీపై అదే పంచాయతీలోని మరొక పాఠశాలకు వెళ్తున్న సందర్భంగా గ్రామస్తులు ఆయనను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎపిసిపిఎస్ఇఎ జిల్లా అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేశారని అన్నారు. 2017 నుండి 2025 వరకు ఉపాధ్యాయుడిగా పనిచేసిన కాలంలో 21 మంది విద్యార్థులను నవోదయ పరీక్షల్లో ఎంపికయ్యేలా కృషి చేశారని పేర్కొన్నారు. నాడు, నేడు పాఠశాలగా ఎంపిక కావడంలో కృషి చేశారని అన్నారు. మోడల్ స్కూల్ ఏర్పాటు చేయడంలో గ్రామస్తుల సహాయ, సహకారాలతో ఆయన చేసిన కృషి గొప్పదని అన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులు ఆయనను సన్మానించారు. సన్మాన గ్రహీత బాపూజీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల బలోపేతం కావాలంటే గ్రామస్తులు, తల్లి, దండ్రుల సహాయ సహకారాలతోనే సాధ్యమని అన్నారు. పాఠశాలలు బలోపేతం అవుతాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ కాటూరి అంకరాజు, ఆరుంభాక సర్పంచ్ కామినేని కోటేశ్వరరావు, బొలగాని సుబ్బారావు, ఈవూరి వెంకట దుర్గాప్రసాద్, బొర్రు శ్రీనివాసరావు, పీటా శ్రీనివాసరావు, పీట నాగరాజు పాల్గొన్నారు.



జంధ్యాల కరుణ శ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాహితీ భారతి ప్రతినిధులు

జంధ్యాల సాహిత్యం కరుణారస భరితం

ప్రజాశక్తి - బాపట్ల

తెలుగు ఆధునిక సాహిత్య రంగంలో అత్యంత జనాదరణ పొందిన కవుల్లో కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి ఒకరని సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మ అన్నారు. జంధ్యాల పాపయ్య శాస్త్రి 33వ వర్థంతిని సాహితీ భారతీ ఆధ్వర్యంలో పట్టణంలో జమేదారు పేట సాహితీ భారతీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. జంధ్యాల చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ జంధ్యాల పాపయ్య శాస్త్రి రచనలు కరుణా రసభరితంగా ఉండేవని అన్నారు. అందుకే కరుణశ్రీ అనే వారి కలం పేరు సార్థకమైందని తెలిపారు. ప్రముఖ వైద్యులు, ప్రజాకవి శ్రీనివాస్ మాట్లాడుతూ కరుణశ్రీ కవిత్వం సులభశైలిలో సమకాలీన ధోరణిలో చక్కని తెలుగు నుడికారాలతో వినసొంపుగా ఉంటుందని ప్రశంసించారు. ఖండ కావ్యాలు వీరి ప్రత్యేకత అన్నారు. సాహితీ భారతి ఉపాధ్యక్షులు మర్రి మాల్యాద్రిరావు మాట్లాడుతూ కరుణశ్రీ గుంటూరు జిల్లా పెదనందిపాడు సమీపంలో కొమ్మూరు గ్రామంలో జన్మించారని అన్నారు. గుంటూరులోని ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేశారని తెలిపారు. సాహితీ భారతి కోశాధికారి ఆదం షఫీ మాట్లాడుతూ కరుణశ్రీ రచించిన తెలుగు బాల, ఉదయశ్రీ, విజయశ్రీ, కరుణశ్రీ, వంటి కావ్య సంపుటాలు అత్యధిక సంఖ్యలో అమ్ముడుపోయి తెలుగు సాహిత్య కీర్తిని పెంపొందించాయని అన్నారు. సాహితీ భారతి సభ్యులు దగ్గుమల్లి శామ్యూల్ మాట్లాడుతూ కరుణశ్రీ రచించిన పుష్ప విలాపంను ఘంటసాల గానం చేశారని, అది అత్యంత ప్రజాదరణ పొందిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎం జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కాళీ దాసు పాల్గొన్నారు.

గేదెను ఢీ కొట్టి ఆగిన ఎక్స్‌ప్రెస్ రైలు

ప్రజాశక్తి - చీరాల

రైల్వే పట్టాలు దాటుతున్న గేదెను రైలు ఢీకొనడంతో అరగంట పాటు రైలు పట్టాలపై నిలిచింది. ఫైర్ స్టేషన్ రైల్వే గేటు వద్ద శనివారం సాయంత్రం జరిగిన ఘటనలో చెన్నై నుండి విశాఖ పట్నం వైపుకు వెళుతున్న విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ పట్టాలు దాటుతున్న గేదెను ఢీ కొంది. దింతో గేదె కళేబరం రైలు ఇంజిన్‌లో చిక్కుపోయింది. దీంతో రైలు ఆగిపోయింది. 30 నిమిషాల పాటు రైలు చీరాల వద్ద నిలిచిపోయింది. ఈ ఘటనతో రైలులోని ప్రయాణికులు ఒక్క సారిగా భయభ్రాంతులకు గురయ్యారు. రైలు ఎందుకు ఆగిందో అర్థం కాకపోవ డంతో కొంత మంది ప్రయాణికులు దిగివచ్చి పరిస్థితి గమనించారు. రైల్వే స్టేషన్‌కు కూతవేటు దూరంలో రైలు మలుపు తిరుగుతుండగా ఘటన జరిగింది. ప్రధాన ట్రాక్‌పై రైలు ఆగిపో వటంతో వెంటనే సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, టెక్నికల్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని గేదె మృత దేహాన్ని ఇంజన్ నుండి తొలగించారు. గేదె మృతదేహాన్ని రైల్వే ట్రాక్‌పై నుండి పక్కకు తరలించిన అనంతరం రైలు బయలు దేరింది. సాంకేతికంగా ఎలాంటి నష్టం జరగలేదని రైల్వే అధికారులు తెలిపారు. పశువులు రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదం జరగడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ప్రధాన ప్రాంతాల్లో రైలు పట్టాలకు ఇరువైపు ప్రహరీ గోడలు లేకపోవడం వల్లే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులను ప్రజలు, పశు పోషకులు కోరుతున్నారు.



రైలులో ఇరుక్కుపోయిన గేదె మృత దేహం

పొగాకు రైతులకు అండగా ప్రభుత్వం

ప్రజాశక్తి - చీరాల

పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని కలెక్టర్ జె వెంకట మురళి పేర్కొన్నారు. రైతులకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. పొగాకు కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు న్యాయం చేస్తుందని అన్నారు. పట్టణంలోని వేర్ హౌస్ గౌడన్‌లో బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని చీరాల, పర్చూరు శాసన సభ్యులు ఎంఎం కొండయ్య, ఏలూరి సాంబశివరావుతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు చెప్పారు. తేమలేని పొగాకు బేళ్ల కొనుగోలుకు తీసుకోనిరావాలని రైతులకు సూచించారు. పొగాకు కొనుగోలు విషయంలో రైతులు అధైర్యపడొద్దని చెప్పారు. చివరి ఆకు వరకు ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి రామకృష్ణ, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు కరుణశ్రీ, డిప్యూటీ కలెక్టర్ లవన్న, తహశీల్దారు బ్రహ్మయ్య పాల్గొన్నారు.



చీరాలలో పొగాకును పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి
ఆదివారం 22 జూన్ 2025

పొగాకు కొనుగోళ్లపై రైతులెవరూ ఆందోళన పడొద్దు

• చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తాం • పొగాకు కొనుగోలుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది • శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి - ఇంకొల్లు

హెచ్‌డి బర్లి పొగాకు సాగు చేసిన రైతులు ఎవరు తమ పొగాకు అమ్ముడు పోలేదని, తమ పేర్లు రాలేదని ఆందోళన చెందవద్దని శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. మండలంలోని మార్కెట్ యార్డులో రైతులతో ఆయన శనివారం మాట్లాడారు. మండలంలోని పెద్దనక్కలపాలెం రైతులతో పొగాకు కొనుగోలు విషయంపై మాట్లాడారు. పొగాకు రైతులెవరు తమ పొగాకు అమ్ముడుపోదని, ఇంకా తమ పేర్లు రాలేదని, కొనుగోలు చేయలేదని ఆందోళన చెందవలసిన అవసరం లేదని అన్నారు. సిఎం చంద్రబాబు సహకారంతో గ్రామాల్లో నిల్వ ఉన్న పొగాకు మొత్తం కొనుగోలు చేస్తామని అన్నారు. పొగాకు రైతుల సమస్యలు సిఎం విని రైతులను ఆదుకునేందుకు పొగాకు కొనుగోలుకు రూ.300 కోట్లు కేటాయించారని అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు కూడా పొగాకు కొనుగోలు కేంద్రాలకు సహకరించారని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం, ఎప్పుడు పొగాకు కొనుగోలు మార్క్‌ఫెడ్ ద్వారా చేయించలేదని అన్నారు. మొదటిసారి కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు సహకారంతోనే సాధ్యమైందని అన్నారు. ఈ ఏడాది నల్లబర్లీ పొగాకు కంపెనీల మాటలు విని రైతులు సాగు చేశారని అన్నారు. కంపెనీలు పంట ఉత్పత్తి ఎక్కువగా ఉందని, సాగు ఎక్కువగా చేశారని, రైతులు వద్ద కొనుగోలు చేయకపోవడంతో రైతులకు ఇబ్బంది ఏర్పడిందని అన్నారు. పొగాకు సాగు చేసిన రైతులు అందరూ సీఎం యాప్‌లో తన పొగాకు సాగుచేసిన పేరు నమోదు చేయించుకోవాలని తెలిపారు. గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రాలకు సంబంధించిన సిబ్బంది పొగాకు సాగుచేసిన రైతులను కలసి, వారి పొగాకు నిల్వ మండేలతో పాటు రైతు ఫోటోను కూడా తీసుకొని యాప్లో నమోదు చేస్తారని అన్నారు. రైతులు తాము ఎంత పొగాకు సాగు చేసినది? ఎంత నిల్వ ఉన్నది? వివరాలు తెలపాలని అన్నారు. సీఎం యాప్‌లో నమోదైన తరువాత ఒక క్రమపద్ధతిలో రోజువారి పేర్లు ఇచ్చి రైతుల వద్ద పొగకు కొనుగోలు చేస్తారని అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో పొగాకు నిల్వకు అణువుగా ఉన్న గోదాములను పరిశీలించారు. మార్క్‌ఫెడ్ ఎండితో ఫోన్లో మాట్లాడి తప్పనిసరిగా అన్ని కొనుగోలు కేంద్రాలను సోమవారం కొనుగోలుకు సిద్ధం చేయాలని తెలిపారు.



రైతులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ ఏలూరి సాంబశివరావు

పొగాకు నిల్వలకు గోడౌన్ల సమస్య

పొగాకు కొనుగోళ్లకు సంబంధించి ప్రధానంగా గోడల సమస్య నెలకొని ఉందని అన్నారు. ఇందుకు సంబంధించి గుంటూరు జిల్లాలోని కాకుమాను, కెబివి పాలెం గ్రామాల్లో గోదాములను పరిశీలించినట్లు తెలిపారు. గత ఐదేళ్లలో మార్కెట్ యార్డులలో ఇప్పటివరకు ఎలాంటి నూతన గోదాముల నిర్మాణం చేయకపోవకపోగా ఉన్న వాటిని నిర్వహణ సరిగా లేక అధ్వానంగా ఉన్నాయని అన్నారు. ఇది రైతులపై వైసీపీ ప్రభుత్వ ధోరణికి నిదర్శనం అన్నారు. పర్చూరు మార్కెట్ యార్డులో గతంలో టిడిపి ప్రభుత్వం ఆధ్వర్యంలో తాను నిర్మించిన నిల్వ గోడానులు ఇప్పుడు ఉపయోగపడుతున్నాయని అన్నారు.

ఒకేసారి పొగాకు కొనుగోలు చేయాలంటే కష్టం

గ్రామాల వారీగా ప్రతి గ్రామంలో పొగాకు సాగు చేసిన రైతుల పొగాకు నిలువలు ఒకేసారి కొనుగోలు చేయాలంటే కష్టమని ఎంఎల్‌ఎ అన్నారు. ఒక క్రమ పద్ధతిలో ఒక్కొక్క గ్రామానికి సంబంధించిన రైతులకు వ్యవసాయ శాఖ కేటాయించిన తేదీల ప్రకారం కేటాయించిన చెక్కుల ప్రకారం కొనుగోలు చేస్తారని అన్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డు, బ్యాంకు ఎకౌంటు నెంబరు వ్యవసాయ శాఖ యాప్‌లో నమోదు చేయించుకోవాలని అన్నారు. కొనుగోలు చేసిన పొగాకు సంబంధించిన నగదు ఏ రైతుకు ఆ రైతు ఎకౌంట్లో పడతాయని తెలిపారు. రైతులందరూ ధైర్యంగా ఉండాలని చివరి ఆకు వరకు అన్ని గ్రామాల్లో కొనుగోలు చేసే బాధ్యత తమదని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం మొదటి గ్రేడు పొగాకు క్వింటా రూ.12వేలు, లోయర్ గ్రేడ్ పొగాకు క్వింటా రూ.6వేలకు కొనుగోలు చేస్తారని తెలిపారు. ఈ లోపు ఒకవేళ కంపెనీలు, ప్రైవేటు వ్యాపారులు ముందుకు వచ్చి అదనం రేటు పెడితే పొగాకు రైతులు వారికే అమ్ముకోవచ్చని అన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



యద్దనపూడిలో మొక్కలు నాటుతున్న దృశ్యం

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని అనంతరంలో పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మొక్కలు నాటారు. ఎంపిడిఓ జావేద్ మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులను బట్టి ప్రతి ఒక్కరు మొక్కలు పెంచి భవిష్యత్తు తరాలకు ఆరోగ్య వంతమైన వాతావరణం అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు, మొక్కలు నాటి వాతావరణ కాలుష్యం తగ్గించాలని కోరారు. డిప్యూటీ ఎంపిడిఒ పిటివి కృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో పచ్చదనం పెరిగినప్పుడు వర్షాలు సకాలంలో కురిసి పంటలు సక్రమంగా పండే అవకాశం ఉందన్నారు. ఇళ్లచుట్టు ప్రక్కల ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని అన్నారు. సచివాలయ కార్యదర్శి మోహన్ బాబు, హెచ్‌ఎం రాఘవరెడ్డి, పిడి కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు రామ మోహన్, యోహాను, నాయకులు తారక రామారావు, వంశీకృష్ణ, మానుకొండ సాంబశివరావు పాల్గొన్నారు.

పర్చూరు : ప్రతి ఒక్కరూ తమ చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిడిఒ వి ప్రద్యుమ్న కుమార్ అన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత పాటించడం వల్ల వ్యాధులు బారిన పడకుండా ఉంటారని తెలిపారు. ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థాల్లో తడి, పొడి చెత్త వేరు చేసి పంచాయతీ పారిశుద్ధ్య వాహన కార్మికులకు అందజేయాలని సూచించారు. పరిశుభ్రత పాటించడం బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ వేయొద్దని సూచించారు. ఇవి పర్యావరణానికి హాని కలిగిస్తాయని చెప్పారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని చెప్పారు. తద్వారా భూ కాలుష్యం తగ్గుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షించాలని అన్నారు. పంచాయతీ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతినెల 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర నిర్వహిస్తున్నట్లు ఇఓపిఆర్డి కె సత్యనారాయణ చెప్పారు. కార్యక్రమంలో పిఆర్ ఎఇ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి మస్తానరావు, వార్డు సభ్యులు షేక్ గౌస్ భాష పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఉప్పుటూరు హెూమియో వైద్యులు డి చంద్రశేఖర్ తెలిపారు. 3వ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్రలో భాగంగా హెూమియో వైద్యులు స్థానిక జడ్పీ హై స్కూల్లో మొక్కలు నాటారు. యోగా మాస్టర్ ట్రైనర్ డాక్టర్ చంద్రశేఖర్‌ను సూర్యలంక బీచ్ యోగేంద్రలో బాపట్ల ఎమ్మెల్యే వేగేసేన నరేంద్ర వర్మ, కలెక్టర్ జె వెంకట మురళి అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రాకుల తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

అద్దంకి : ప్రతి నెల 3వ శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రాలో భాగంగా నీరు, మీరు కార్యక్రమాన్ని మండలంలోని సింగరకొండపాలెంలో శనివారం నిర్వహించారు. డిప్యూటి ఎంపిడిఒ ఆర్‌విఎస్ ప్రసాదరావు మాట్లాడారు. పరిసరాల్లో చెట్లు నాటారు. నీటిని వృథా చేయకుండా నీటి నిల్వలు చేసుకునేందుకు ఇంటి ముందు ఇంకుడు గుంటలు నిర్మించుకోవాలని సూచించారు. బోర్లవద్ద, బావులవద్ద పరిశుభ్రత పాటించాలని అన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పర్చూరులో స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ



అద్దంకిలో స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ

చోరీ కేసులో ముద్దాయి అరెస్టు

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని చింతపల్లిపాడుకు చెందిన పాలపర్తి నాగరాజును ఎస్ఐ రత్న కుమారి శనివారం అరెస్టు చేశారు. స్థానిక స్టేషన్‌లో చోరీ ఘటనపై నమోదైన 21/2025 యు /సెక్షన్ 305(ఎ) బిఎస్ఎస్ కేసులో నాగరాజు ముద్దాయి. ఇతను చింతపల్లిపాడుకు చెందిన ముద్దాయిని తాతపూడి ఓవర్ బ్రిడ్జి వద్ద అరెస్టు చేసి అతని వద్ద నుండి యాక్టివ స్కూటీ, ఒక మొబైల్ ఫోను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ముద్దాయిని పర్చూరు కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా ఎవరైన కొత్త వ్యక్తులు వచ్చినట్లు గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రశంసాపత్రం అందజేత

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్పెంటర్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ కోడూరు వెంకటేశ్వరరావుకు ప్రభుత్వం నుండి మంజూరైన యోగా ప్రశంసా పత్రంను ఎంపిపి డివి లలిత కుమారి, ఎంపిడిఒ ఎస్ వెంకటరమణ చేతుల మీదగా శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి దున్నా తిరుపతి బాబు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



కోడూరుకు పత్రం అందజేస్తున్న ఎంపిపి

వైసిపి మేధావుల విభాగం కార్యదర్శిగా అప్పిరెడ్డి

ప్రజాశక్తి - వేమూరు

చుండూరు మాజీ ఎంపీపీ ఉయ్యూరు అప్పిరెడ్డి వైసిపి మేధావుల విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులు అయ్యారు. వైసిపి కేంద్ర కార్యాలయం నుంచి అధికారికంగా శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. వైసిపి ఇన్‌ఛార్జి వరికుటి అశోక్ బాబు సిఫార్సు మేరకు అప్పిరెడ్డిని నియమించినట్లు తెలిపారు. ఆయనను నియమించడం పట్ల పలువురు అభినందించారు. తన నియామకానికి కృషి చేసిన వైసిపి ఇంచార్జ్ వరికూటి అశోక్ బాబుకు అప్పిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



ఉయ్యూరు అప్పిరెడ్డి



కోర్టులో లోకదాలత్‌పై సమీక్షిస్తున్న సీనియర్ జడ్జి పి శాంతి

రాజీ మార్గమే రాజమార్గం

ప్రజాశక్తి - పర్చూరు

ఇరువర్గాలు మధ్య రాజీ పడదగే కేసులు లోకదాలత్‌లో పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి పి శాంతి సూచించారు. స్థానిక కోర్టు హాలులో పోలీసు అధికారులతో శనివారం సమీక్షించారు. జులై 5న కోర్టు ఆవరణలో జాతీయ లోకదానత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేసి రాజీ పడదగిన క్రిమినల్ కేసులు ఇరువర్గాలతో సామరస్యంగా మాట్లాడి కక్షిదారుల సమ్మతితో కేసులు లోకదాలత్‌లో పరిష్కారమయ్యేటట్లు చూడాలని సూచించారు. లోకదాలత్‌లో పరిష్కారం అయ్యే కేసులపై అప్పిలు ఉండదని తెలిపారు. ఇరు వర్గాల వారికి సమన్యాయం జరుగుతుందని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. సమావేశంలో ఎక్సైజ్ సిఐ భుజంగరావు, ఇంకొల్లు ఎఎస్ఐ నాగలక్ష్మి, పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.


గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అందుకున్న చందలూరు విద్యార్థిని

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని నాయపాము శృతి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అందుకున్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నం ఆర్‌కె బీచ్‌లో ప్రధాని నరేంద్ర మోడీతో కలిసి యోగాలో ఆమె పాల్గొని ప్రతిభ చూపారు. 170 మంది ప్రధానితో కలిసి యోగాసనాలు నిర్వహించారు. ఇందుకుగాను శృతికి ప్రభుత్వం గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికెట్ అందజేశారు. నిరుపేద వ్యవసాయ కుటుంబంలో జన్మించి, యోగాలో అనేక పథకాలు సాధించి, 14ఏళ్లకే గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అందుకోవటం గొప్ప విషయమని గ్రామ ప్రజలు తెలిపారు. యోగాలో శృతికి శిక్షణ ఇచ్చి అంచలంచెలుగా ఎదిగేందుకు ప్రోత్సహించిన పాఠశాల పిడి ప్రతిమకు కూడా గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికేట్ అందజేశారు. ఈ ప్రాంతంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు అందుకున్న వ్యక్తులుగా వీరిద్దరూ నిలుస్తారని ప్రజల అభినందిస్తున్నారు.




యోగాలో ప్రతిభ చూపిన శృతి



గిన్నిస్ వరల్డ్ రికార్డు ధృవీకరణ పత్రం

ఆర్‌ఒ ప్లాంట్ ప్రారంభం



నగరంలోని 36వ డివిజన్ అయ్యప్పస్వామి దేవస్థానం వద్ద రంగారాయుడు చెరువులో ఆర్‌ఒ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు
- ప్రజాశక్తి, ఒంగోలు

దైనందిన జీవితంలో

యోగాను ఒక భాగం చేసుకోవాలి..

కలెక్టర్ వెంకటమురళి



యోగా చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

యోగా వల్ల కలిగే లాభాలు, ప్రయోజనాల గురించి తెలుసుకొని దైనందిన జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం సూర్యలంక బీచ్ లో యోగ కార్యక్రమాన్ని 10 వేల మందితో ఘనంగా నిర్వహించారు. యోగ కార్యక్రమంలో కలెక్టర్ జె. వెంకట మురళి, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ రాజు, చీరాల శాసనసభ్యులు ఎం.మాల కొండయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో కేర్ యోగా నాచురోపతి మెడికల్ కాలేజీ విద్యార్థిని, విద్యార్థులు నిర్వహించిన యోగా ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజం వైపు ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలన్నారు.

బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ యోగాంధ్ర వల్ల ఆరోగ్యం, ఆనందం ప్రతి మనిషికి దక్కాలని అన్నారు. జిల్లా అధికారులు జిల్లా కలెక్టర్ సూచన మేరకు పనిచేస్తూ 22వ స్థానంలో ఉన్న జిల్లాను 5వ స్థానానికి తీసుకువచ్చే విధంగా కషి చేసినందుకు అభినందనలు తెలిపారు. చీరాల శాసనసభ్యులు ఎం మాలకొండయ్య మాట్లాడుతూ ప్రపంచంలోని సమస్త మానవాళికి యోగా వల్ల మంచి జరగాలన్నారు.

యోగాంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో మే 21వ తేదీ నుండి జూన్ 21వ తేదీ వరకు ఇంత ఘనంగా నిర్వహించడానికి కారుకులైన అధికారులను, యోగా గురువులను జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు, చీరాల శాసనసభ్యులు ఎం.మాలకొండయ్య శాలువా, మెమెంటోలతో సత్కరించారు. యోగా కార్యక్రమం అనంతరం బాపట్ల నగరవనంలో జిల్లా కలెక్టర్, బాపట్ల శాసనసభ్యులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, డిఆర్‌డిఎ పిడి శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ బి.శ్రీనివాసరావు, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి పి.గ్లోరియా, జిల్లా అధికారులు, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరుకులు..పరుగులు..



యోగాంధ్ర పేరుతో ప్రభుత్వం గత నెల రోజులుగా జిల్లా అధికార యంత్రాంగాన్ని ఉరుకులు, పరుగులు పెట్టించింది. శనివారంతో యోగాంధ్ర కార్యక్రమం ముగిసింది. రాష్ట్రప్రభుత్వం ఈ యోగా కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించడంతో అధికార యంత్రాంగం యావత్తూ అన్ని పనులనూ పక్కనపెట్టి కార్యాలయాలు, స్కూళ్ళు, కాలేజీల్లో యోగా చేపట్టారు. అన్ని మండలాలు, గ్రామాల్లో యోగా కార్యక్రమాలు జరిపారు. నియోజకవర్గ కేంద్రాల్లో యోగాంధ్ర కోసం భారీగా సమీకరణలు చేశారు. అయితే దీన్ని ప్రభుత్వ కార్యక్రమంగా చేపట్టడంతో అనేక ప్రభుత్వ కార్యక్రమాల్లో ఇది ఒకటిగా మిగిలిపోయింది. దీని కోసం భారీగా ఖర్చు చేశారు.

మార్క్ ఫెడ్ ద్వారా బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోళ్లు ప్రారంభించారు. రైతు సంఘాల వరుస ఆందోళనలు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నిరంతరంగా చేసిన కృషి కారణంగా మొదటిసారిగా పొగాకును రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చింది. రైతులు పొగాకు అమ్మకాలలో ఇబ్బందులు ఎదుర్కోకుండా పొగాకును రెండు గ్రేడ్ లుగా విభజించి, మొదటి రకం పొగాకు కేజీ ధర రూ. 120, రెండో రకం పొగాకు ధర రూ.60పై కొనుగోళ్ళు చేపట్టారు. రైతుల ఆధార్ అనుసంధానంతో రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి. ప్రస్తుతం జిల్లాలో ఏడు కొనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయి. పొగాకు కొనుగోళ్లు మూడు నెలల పాటు కొనసాగుతాయని భావిస్తున్నారు. కాగా ఈ ఏడాది పొగాకు పంట సాగు చేసిన రైతులు ఇబ్బందులు పడిన నేపథ్యంలో రానున్న వ్యవసాయ సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని అధికారులు కోరుతున్నారు.

జిల్లాఅంతటా ఇసుక అక్రమ తవ్వకాలు, అమ్మకాలు యథేశ్చగా సాగుతున్నాయి. తీరప్రాంతంతో పాటు, కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో ప్రజా ప్రతినిధుల అండతో ఇసుక తరలింపులు జరుగుతున్నాయి. అధికారులు కూడా ఏ మాత్రం అడ్డుకోలేని పరిస్థితి నెలకొంది. పట్టపగలు ఇసుక టిప్పర్ల ద్వారా వెళుతున్న వాటిని ఆపేవారు లేకుండా పోతున్నారు. కృష్ణానదీ తీరంలో అయితే ఇసుక తవ్వకాల విషయంలో అటు కష్ణాజిల్లా ఇటు బాపట్ల జిల్లాల మధ్య అధిపత్య పోరు ఉద్రిక్తతలకు దారి తీస్తోంది. కొద్ది రోజుల క్రితం జిల్లాలోని కొల్లూరు మండలం జువ్వలపాలెం, కష్ణాజిల్లా చల్లపల్లి మండలం ఆముదాల లంక గ్రామాల మధ్య నెలకొన్న కష్ణానది సరిహద్దు వివాదం పరిష్కారం కోసం రేపల్లె, మచిలీపట్నం ఆర్‌డివోలు, పోలీసు అధికారులు వెళ్ళవలసి వచ్చింది. ఇసుక అక్రమ తవ్వకాలు రెండు లంక గ్రామాల మధ్య ఘర్షణలకు దారితీయడంతో ఆర్డీవోలు వచ్చి జిల్లాల మధ్య సరిహద్దులను విడదీసి జెండాలు పాతారు. ఇసుక అక్రమ తరలింపు అనేది సామాన్యమైన విషయమైంది.

అవినీతి నిరోధక శాఖ అధికారులు ఎన్నిసార్లు దాడులు చేసి ప్రభుత్వ అధికారులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నా ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి సర్వసాధారణమైంది. ప్రతి పనికి సామాన్యులు ఎంతో కొంత ఇవ్వందే పనులు కావడం లేదు. మార్కాపురం ఇరిగేషన్ కార్యాలయంలో ఏసిబీ అధికారులు దాడులు జరిపారు. రూ.30 వేలు లంచం తీసుకుంటూ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు అనీశా అధికారులకు పట్టుబడ్డారు.

జిల్లాలోని సముద్రతీరం ఆక్రమణల చెరలో చిక్కుకుంది. రియల్ ఎస్టేట్ దారులు, రీసార్టుల యాజమాన్యాలు యథేచ్ఛగా తీరాన్ని ఆక్రమిస్తున్నారు. వీరికి అండగా ప్రజాప్రతినిధులు నిలవడంతో వీటిని నిలువరించడం సాధ్యం కావడం లేదు. చీరాల–బాపట్ల సరిహద్దులోని సముద్ర తీర ప్రాంతమైన వాడరేవు, విజయలక్ష్మీపురం గ్రామాల మధ్య ఈపురుపాలెం స్ట్రయిట్ కట్ కాలువ వద్ద నెలకొన్న రియల్ ఎస్టేట్‌దారు, మత్స్యకారుల మధ్య నెలకొన్న వివాదం ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. దీంతో సదరు వివాదాస్పద భూమిలోకి ఎవరు ప్రవేశించరాదని, భూమిపై బిఎన్ఎస్ 163 యాక్ట్ అమలు చేశామని కలెక్టర్ ప్రకటించారు. ఇక్కడ ఉన్న స్ట్రయిట్ కట్ కాలువ, సముద్రం కలిసే చోట ఉన్న సీమౌత్‌ను చదును చేశారు. ఈ విషయమై స్థానిక మత్స్యకారులు పలు పర్యాయాలు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ వివాదాస్పదంగా ఉన్న సదరు భూమి విషయమై వాస్తవాలు ఏమిటి అనేది రెవెన్యూ అధికారులు తేల్చిన పరిస్థితి లేకపోయింది. దీంతో పాటు తీరమంతటా ఉన్న ఇసుక దిబ్బలు కొట్టుకెళుతున్నారు. దీన్ని అధికారులు నిలువరించలేక పోవడంతో రానున్న కాలంలో తీర ప్రాంతానికి ముప్పు ఏర్పడే పరిస్థితి నెలకొంది.

- ప్రజాశక్తి, బాపట్ల జిల్లా

దిగజారుతున్న పొగాకు ధరలు

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

పొగాకు ధరలు దిగజారుతున్నాయి. గత నాలుగైదు రోజులుగా కనిష్ఠ ధర కిలోకు రూ.20 తగ్గి రూ.160కు పడిపోయింది. మంగళవారం నుంచి ఇదే ధర కొనసాగడం గమనార్హం. కాగా సగటు ధర కూడా అదే రీతిలో పడిపోయింది. లైట్ సాయిల్ పరిధిలో కిలో సగటు ధర రూ.229.30 పైసలకు పడిపోయింది

శనివారం నాడు రీజియన్ పరిధిలో 10137 బేళ్లు ఆక్షన్ కి రాగా 7363 బేళ్లు అమ్ముడుపోయాయి. వివిధ కారణాలు చూపి 2374 బేళ్లను(23.41శాతం) తిరస్కరించారు. బ్లాక్ సాయిల్ పరిధిలోని ఒంగోలు 1, 2, వెల్లంపల్లి, టంగుటూరు, కొండపి వేలం కేంద్రాల్లో 5430 బేళ్ల ఆక్షన్‌కు తేగా 4307 బేళ్లు కొనుగోలు చేసారు. ఇక్కడ 1123 (20.18%) బేళ్లు తిరస్కరించారు. కిలో రూ కనిష్ఠ ధర రూ 180, గరిష్ట ధర రూ.280 పలికింది. సగటున కిలో రూ.251.77 (నిన్నటి కంటే రూ 1.65 తగ్గింది) పైసలు పలికింది. కాగా లైట్ సాయిల్ పరిధిలో పొదిలి, కనిగిరి,కందుకూరు 1,2 కలిగిరి,డిసిపల్లి కేంద్రాల్లో 4707 బేళ్ల ఆక్షన్ కు తేగా 3456 బేళ్లు కొనుగోలు జరగ్గా 1251 (26.57%) బేళ్లు తిరస్కరించారు. ఇక్కడ కిలో గరిష్ట ధర రూ 280 కాగా కనిష్ఠ ధర 160 కి దిగజారింది. సగటున కిలో రూ.299.30 (నిన్నటి కంటే రూ 1-41పైసలు తగ్గింది) లు పలికింది. ఈ నెల 16 నుంచి మార్క్ ఫెడ్ రంగంలో దిగి కొనుగోలు చేస్తుందని జిల్లాకు చెందిన మంత్రుల ప్రకటనలు ఆచరణకు నోచుకోక పోవడం గమనార్హం. స్వతహాగా బోర్డు ఇడి వేలం కేంద్రాలు పర్యటించి ధరపై భరోసా ఇచ్చినప్పటికి, పొగాకు ధర పెరగడం అటుంచి మరింత దిగజారడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

'ఉపాస్' వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్యసేవలందిస్తున్న డాక్టర్ ప్రకాష్ చవల

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు, ఏనుగు చెట్టు వద్ద గల ప్రమీల ఆహార్‌లో వాసవీ క్లబ్, ఒంగోలు విజన్ ఉదయాస్తమ సేవలలో భాగంగా వారి ఆధ్వర్యంలో ఉపాస్ సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ ఒంగోలు వారి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అడిషనల్ ట్రెజరర్ పువ్వాడ నాగవెంకట నారాయణ ఉచిత వైద్యశిబిరం ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 300 మందికి షుగర్, బిపి, ఈసిజి, హెచ్‌బిఎ1సి, ఆర్‌బిఎస్, డయాబెటిక్ రెటినోపతి వైద్యపరీక్షలు ఉచితంగా నిర్వహించి.. మందులు అందజేశారు. ఉచిత వైద్యశిబిరంలో ఉపాస్ హాస్పిటల్ ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ ప్రకాష్ చవల, డాక్టర్ శ్రీధర్ చివుకుల, డాక్టర్ పోకూరి శ్రీనివాస్, డాక్టర్ జయవర్ధన్, డాక్టర్ జి.శ్రీనివాస్ వైద్యసేవలందించారు. మెగా వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి ఉపాస్ హాస్పిటల్‌లో 30 రోజుల పాటు ఉచిత ఓపి మరియు నిర్ణీత వైద్యపరీక్షలపై 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు డైరెక్టర్లు డాక్టర్ ఉమాపతి చౌదరి, డాక్టర్ ప్రకాష్ చవల, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ అనపర్తి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఇంటెర్నేషన్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ అచ్యుత శ్రీనివాస్, వాసవి క్లబ్ ఒంగోలు విజన్ ప్రెసిడెంట్ పబ్బిశెట్టి రాజేష్, సెక్రటరీ చీమకుర్తి శివ ప్రసాద్, ఉపాస్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.